క్లుప్తంగా

భక్తితోనే మానసిక ప్రశాంతత



వ్రతాలలో పాల్గొన్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని అజ్జమర్రి గ్రామంలో గల హనుమాన్ ఆలయ ఆవరణలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వ్రతాలలో మాజీ సర్పంచ్ నగేశ్‌యాదవ్‌తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు. టీటీడీ సభ్యుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

ఆయిల్ ఫామ్‌తో అధిక లాభాలు

వ్యవసాయ అధికారి ఝాన్సీ



ఆయిల్ ఫామ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ఝాన్సీ

వెల్దుర్తి(తూప్రాన్): వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగుచేస్తే అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి ఝాన్సీ పిలుపునిచ్చారు. ఈ మేరకు వెల్దుర్తి మండలం ఎల్కపల్లి గ్రామ శివారులో రైతు సత్యనారాయణగౌడ్ వ్యవసాయ క్షేత్రంలో సాగుచేస్తున్న ఆయిల్ ఫామ్ తోటను ఆమె పరిశీలించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతుకు సూచించారు. ఆయిల్ ఫామ్‌తో పాటు అంతర పంటలు వేసుకోవాలని, ఒక ఎకరం వరి పండించడానికి అయ్యే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగుచేసుకోవచ్చని చెప్పారు. సాగుకు సబ్సిడీ ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ వందన ఉన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన టీఎస్‌యూటీఎఫ్ కమిటీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలలో శనివారం టీఎస్‌యూటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటస్వామి, ఉపాధ్యక్షుడుగా ఆదినారాయణ, అనిత, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా మోహన్, కార్యదర్శిగా బాల్‌సింగ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెంకటస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, మహేశ్, శ్రీకాంత్, నజీర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎంఈవో నీలకంఠం



బోధన తీరును పరిశీలిస్తున్న నీలకంఠం

హవేళీఘణాపూర్(మెదక్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి నీలకంఠం సూచించారు. శనివారం మండల పరిధిలోని గుట్టకిందిపల్లి, శివ్వాయిపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు. బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసరంగా వెళ్లాల్సి వస్తే ముందుగా అనుమతి తీసుకోవాలని, సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానోపాధ్యాయులు గంగా, మహేశ్, ఉపాధ్యాయులు సంతోశ్, ప్రవంతి, రమాదేవి, దేవదాస్ తదితరులు ఉన్నారు.

టీపీసీసీ కార్యదర్శికి సన్మానం

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు దేమె యాదగిరి, చిలుక గంగాధర్, సుందర్‌సింగ్ టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావును కలిసి సన్మానించారు. ఆయన నివాసంలో శనివారం కలిసిన కౌన్సిలర్లు పలు విషయాలపై చర్చించారు. నాయకులు అల్లాడి వెంకటి, హన్మంతరావు, దేవుని రాజు, స్వామి కార్యక్రమంలో పాల్గొన్నారు.

‘ఆవాసం’ విద్యార్థులకు వరం

ఆ ఆవాసం విద్యాలయం పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. ఉత్తమ విద్యార్థులుగా, దేశభక్తి పెంపొందించే విధంగా వారిని తీర్చిదిద్దడమే ఈ విద్యాలయం ప్రధాన ఉద్దేశం. 2006లో ప్రారంభమైన ఈ ఆశ్రయ కేంద్రం ఎంతో మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.



ఆవాస విద్యాలయం ఇదే..

- ప్రతిభ ఉన్న పేద పిల్లలకు ఉచితం
- దాతల సహకారంతో నిర్వహణ
- అన్ని రంగాల్లోను శిక్షణ
- నేడు 8వ వార్షికోత్సవం

రామాయంపేట(మెదక్): ట్రాన్స్‌కో మాజీ ఉద్యోగి కృష్ణారెడ్డి 2006లో సేవాభారతి సంస్థ ద్వారా ఈ ఆవాసం విద్యాలయాన్ని ప్రారంభించారు. ఇది ఎంతో మంది చిన్నారులకు హాస్టల్‌లాగా ఆశ్రయం కల్పిస్తోంది. మొదట్లో కేవలం 10 మందితో ప్రారంభమైన ఈ నిలయంలో నేడు 61మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయన సేవాభావాన్ని చూసి కొందరు దాతలు విరాళాలు అందజేస్తూ విద్యాలయం అభివృద్ధికి తోడ్పడుతున్నారు. నేడు కొందరు ప్రవాస భారతీయులు ఇందులోని విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నారు.

ప్రతిభ ఉన్న పేద విద్యార్థులే..

ఈ ఆవాసంలో చదువుకుంటున్నవారంతా ప్రతిభ ఉన్న పేద విద్యార్థులే. కుల, మత భేదం లేకుండా అన్ని వర్గాల వారు ఈ విద్యాలయంలో ఉన్నారు. తల్లిదండ్రులు లేని విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారు. అడ్మిషన్ కోసం ప్రతి ఏటా పాఠశాలలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేస్తారు. అనంతరం ఎంపికైన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి కుటుంబ పరిస్థితులను ప్రత్యక్ష్యంగా పరిశీలించన తరువాతనే చేర్చుకుంటారు. ఎంపికైన విద్యార్థులకు భోజనంతో పాటు దుస్తులు, దుప్పట్లు, ఇతర సామగ్రి అందజేస్తారు. ఈ విద్యార్థులు ప్రతిరోజూ ఆవాసం నుంచి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి వస్తారు. రాత్రివేళ వారికి సబ్జెక్టు లవారీగా శిక్షణ ఇస్తున్నారు.

యోగా, కర్రసాములో శిక్షణ..

ఎంపిక చేసుకున్న విద్యార్థులకు దేశభక్తిని నింపడానికి ప్రత్యేకంగా బోధన ఇస్తారు. సమాజంలో తమ బాధ్యతలను గుర్తెరిగి ముందుకు సాగే విధంగా తర్ఫీదు ఇస్తున్నారు. వాటితోపాటు కర్ర సాము, యోగాలోను శిక్షణ ఇచ్చి వివిధ తిక ప్రదర్శనలలో భాగం చేస్తారు.

దాతల సహాయం అవసరం

విద్యాలయ నిర్వహణకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవడానికి కృష్ణారెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారు. దానిని గుర్తించి పలువురు వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, ఎన్‌ఆర్‌ఐలు తమకు తోచినంతగా సహాయం అందజేస్తున్నారు.

చదువుతోపాటు సంస్కారం నేర్పుతున్నాం



ఆవాసంలో చదువుతో పాటు సంస్కారం నేర్పుతున్నాం. పేదరికం వల్ల చదువుకోలేని స్థితిలో ఉన్న విద్యార్థులను చేర్చుకొని వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నాం. సమాజంలో తమవంతు బాధ్యతలను గుర్తించుకునే విధంగా తర్ఫీదు ఇస్తున్నాం.

– కృష్ణారెడ్డి, వ్యవస్థాపకుడు, ఆవాస విద్యాలయం

లాస్య కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ



లాస్య కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత తదితరులు

నర్సాపూర్: కంటోన్మెంటు ఎమ్మెల్యే దివంగత లాస్య నందిత కుటుంబ సభ్యులను శనివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పరామర్శించారు. 23న రోడ్డు ప్రమాదంలో లాస్యనందిత మరణించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఉదయం ఎమ్మెల్యే లాస్య ఇంటికి వెళ్లి ప్రమాదం జరిగిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ వారికి మనోధైర్యం కల్పించి ఓదార్చారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు మన్సూర్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అంత్యక్రియల్లో..

నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి వరుసకు తమ్ముడైన కౌడిపల్లి మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చిలుముల వెంకటేశ్వర్‌రెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి(29) క్యాన్సర్‌తో శుక్రవారం మృతి చెందాడు. గ్రామంలో శనివారం జరిగిన అంత్యక్రియలకు ఎమ్మెల్యే సునీతారెడ్డి, నర్సాపూర్, మెదక్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యేలు మదన్ రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి, నర్సారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతిమయాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు పీపీ ప్రతాప్‌రెడ్డి, సుహాసిని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీలు రాజునాయక్, వినోదారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ శనివారం అధ్యక్షుడు సార రామాగౌడ్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీశ్ ..

కౌడిపల్లి(నర్సాపూర్): మాజీ సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి కుమారుడు సంతోష్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకుని తన సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు గాలి అనిల్‌కుమార్, దుర్గారెడ్డి, నర్సింహారెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ చిన్నంరెడ్డి, భిక్షపతి తదితరులు ఉన్నారు.



వెంకటేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న హరీశ్‌రావు

పీఎం కిసాన్‌కు ఈ కేవైసీ తప్పనిసరి

- వ్యవసాయాధికారి రాజ్ నారాయణ

నిజాంపేట(మెదక్): పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించిన డబ్బులు జమకాకపోతే వెంటనే ఈ కేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటికీ ఈ కేవైసీ చేయించుకోని రైతులు 211 మంది ఉన్నారని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్ ద్వారా లేదా మీసేవ, సీఎస్సీ సెంటర్‌ను సందర్శించి బయోమెట్రిక్ విధానం ద్వారా ఈ కేవైసీ చేసుకోవచ్చని వివరించారు. అప్పుడు కూడా ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వ్యవసాయ విస్తీర్ణాధికారిని కలిస్తే ప్రత్యేక ఫేషియల్ యాప్ ద్వారా ఈకేవైసీని పూర్తి చేస్తారని తెలిపారు. మండలంలో 74 మందికి తమ బ్యాంకు ఖాతా వివరాలు ఆధార్ నెంబర్‌కు అనుసంధానం కాకపోవడం వల్ల పీఎం కిసాన్ నిధులు నిలిచి పోయాయని పేర్కొన్నారు. రైతులు దగ్గరలోని పోస్ట్‌ఫీస్‌లో కొత్త ఖాతాను ప్రారంభించినట్లయితే వారికి నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలో పడే అవకాశం ఉందని తెలిపారు. 16వ విడత నిధులు ఈ నెల చివరి వారంలో పడే అవకాశం ఉందని, వివరాలకు క్లస్టర్ పరిధిలో గల వ్యవసాయ విస్తీర్ణాధికారిని సంప్రదించాలని సూచించారు.



రాజ్ నారాయణ

నార్సింగి అభివృద్ధికి కృషి

కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): పదేళ్లపాటు వివక్షకు గురైన నార్సింగి మండలానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు దుబ్బాక నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. శనివారం నార్సింగిలోని అసంపూర్తిగా ఉన్న గోదాం నిర్మాణం, పెద్దమ్మ ఆలయం, నర్సంపల్లిలో రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, నర్సంపల్లితండాలో సేవాలాల్ గుడి వద్ద సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి చేపట్టిన పనులను గత ప్రభుత్వం పదేళ్లుగా పట్టించుకోలేదని, దీంతో అసంపూర్తిగా ఉన్న పనులను ముందుగా పూర్తిచేయనున్నట్లు చెప్పారు. అలాగే కళాశాల భవనం కోసం నిధులు అందించనున్నట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ముఖ్యమంత్రి ద్వారా ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నార్సింగి మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్, నర్సంపల్లి మాజీ సర్పంచ్ బాల్‌రాజ్‌గౌడ్, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఆస్తిపన్ను కట్టలేదని దుకాణాలు సీజ్

తెరిపించిన మున్సిపల్ చైర్మన్

- 2004 నుంచి రూ.15లక్షల బకాయి
- చెల్లింపులో ఆలయ కమిటీ నిర్లక్ష్యం
- మండిపడుతున్న ప్రజలు

మెదక్ మున్సిపాలిటీ: స్థానిక కోదండ రామాలయానికి చెందిన 23 దుకాణాలకు మున్సిపల్ అధికారులు తాళాలువేస్తే చైర్మన్ వచ్చి క్షణాల్లో వాటిని తెరిపించారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. ఆలయానికి సంబంధించి మొత్తం 23 దుకాణాల సముదాయం ఉంది. వాటికి 20 ఏళ్లుగా ఆస్తిపన్నులు చెల్లించక పోవడంతో సుమారు రూ.15లక్షల వరకు బకాయి పేరుకు పోయింది. ఎన్ని నోటీసులు ఇచ్చినా ఆలయ కమిటీ నిర్లక్ష్యం వహిస్తూ వస్తోంది. ఈ క్రమంలో మున్సిపల్ అధికారులు శనివారం ఆ దుకాణాలకు తాళం వేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అక్కడికి చేరుకొని దుకాణాలను తెరిపించారు. ఇది చర్చనీయాంశంగా మారింది. ఆ దుకాణాలను ఆలయ కమిటీ పలువురు వ్యాపారులకు అద్దెకు అప్పగించి వారి నుంచి ప్రతి నెలా అద్దెలు వసూలు చేస్తోంది. కాని మున్సిపాలిటీకి మాత్రం ఆస్తిపన్ను చెల్లించడం లేదు. వసూలుకు వెళ్లిన మున్సిపల్ అధికారులకు నిర్లక్ష్యపు సమాధానం ఎదురైంది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్ మాట్లాడుతూ ఇప్పటికే పలుమార్లు నోటీసులిచ్చామని, అయినప్పటికీ బకాయిలు చెల్లించడం లేదన్నారు. దీంతో విసిగిపోయి శనివారం దుకాణాలకు తాళంవేసి సీజ్ చేసినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అక్కడికి చేరుకొని వెంటనే దుకాణాలు తెరిపించారు. అధికారులకు సహకారం అందించాల్సిన మున్సిపల్ చైర్మన్ ఆలయ కమిటీకి మద్దతుగా నిలవడం సంచలనంగా మారింది. పన్నులు వసూలు చేయడంలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసే ఆయన పన్నులు వసూళ్లకు అడ్డురావడం ఏమిటని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.



దుకాణాలను తెరిపిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

పీఆర్టీయూటీఎస్ హర్షం

మెదక్ కలెక్టరేట్: జీవో ఎంఎస్ 317లో జరిగిన లోపాలను సవరిస్తూ మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరికృష్ణ తెలిపారు. స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని, ఈ లోపాలను సవరిస్తూ మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. వీలైనంత తొందరలో తన నివేదికను ప్రభుత్వానికి అందజేసి బాధిత ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

కాలువలను పరిశీలించిన ఎమ్మెల్యే

చేగుంట(తూప్రాన్): ఇబ్రహీంపూర్ శివారులోని కాలువలను దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇటీవల కాలువలు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేస్తుండడంతో నీరు వృథాగా పోతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రామాయంపేట కాలువను పరిశీలించారు. రైతులకు పంటలకు నష్టం కలుగకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.



కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మంత్రి దామోదరకు ఆహ్వానం

శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ శక్తిపీఠం మొదటి వార్షికోత్సవానికి రావల్సిందిగా రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహకు శనివారం ఆహ్వాన పత్రిక అందజేశారు. 28, 29న వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రఘునందనరావు, నరేంద్రనాథ్, నీలం మధు, ఆవుల రాజిరెడ్డితో పాటు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు.



ఆహ్వాన పత్రిక అందుకుంటున్న దామోదర

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



నిజాంపేట(మెదక్): చల్మెడ గ్రామంలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్‌లో..



చేగుంట(తూప్రాన్): కృష్ణవేణి పాఠశాలలో..

నిజాంపేట(మెదక్): జిల్లాలోని పలు పాఠశాలల్లో శనివారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. హెచ్‌ఎం, డీఈఓ, ఎంఈఓ, పీఈటీ, ఉపాధ్యాయులు వేషధారులుగా అందరినీ అలరించారు. ముఖ్యఅతిథిగా మండల నోడల్ అధికారి యాదగిరి, హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు మోహన్, మమత, నవీన్ రత్నాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఉత్సాహంగా పాల్గొన్నారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి అలరించారు. ఆ విద్యార్థులను హెచ్‌ఎం విఠల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

అంగన్‌వాడీకి నల్లా కనెక్షన్

- స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్

నర్సాపూర్: ఈ నెల 23న సాక్షిలో వచ్చిన ‘అంగన్‌వాడీలో నీటి గోస’ కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రంలో నల్లా కనెక్షన్ ఇచ్చి నీరువచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి సిబ్బంది ధన్యవాదాలు చెప్పారు.



నల్లా కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సంక్షిప్త వార్తలు

◆ ‘తెరవే’ మహాసభ

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలు హైద్రాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ గద్దర్ వేదికలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు వేదిక మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేశరాజు రమేశ్‌బాబు, తొడబోయిన తిరుపతి కోరారు. కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

◆ గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

శివ్వంపేట(నర్సాపూర్): తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శనివారం గంగమ్మ తల్లికి పూజరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

◆ పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

చేగుంట(తూప్రాన్): ఉపాధ్యాయ ఉద్యోగులకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బోనాల్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, పెండింగ్ బిల్లుల వంటి అంశాలను పరిష్కరించాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా బాధ్యులు మల్లారెడ్డి, నరేందర్, తిరుపతి, ఈశ్వరయ్య తదితరులు ఉన్నారు.

◆ తాళం పగులగొట్టి చోరీ

చిన్నశంకరంపేట(మెదక్): తాళం పగులగొట్టి ఇంట్లో బంగారం, నగదును అపహరించిన ఘటన గవ్వలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రెడ్డి శ్రీనివాస్ నూతన గృహ నిర్మాణం చేపట్టడంతో గ్రామ కమ్యూనిటీ హాల్‌లో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆ హాల్ తలుపునకు తాళం పెట్టి కొరివ్పల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లిచూడగా పెట్టెను కూడా పగులగొట్టి ఉండడం గమనించాడు. అందులో దాచిన 8 గ్రాముల బంగారు నగలు, రూ.50వేల నగదు చోరీకి గురైయ్యాయని గుర్తించి పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ బైక్‌ల దొంగ అరెస్టు

తూప్రాన్: ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శివానందం శనివారం తెలిపారు. రామాయంపేటకు చెందిన కోలల ప్రకాశ్ కొన్ని రోజులుగా నాలుగు ద్విచక్ర వాహనాలను అపహరించినట్టు చెప్పారు. పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రకాశ్‌ను పట్టుకొని విచారించగా అంగీకరించాడని ఆయన తెలిపారు.

◆ చాకరిమెట్లలో భక్తుల సందడి

శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలోని సహకార ఆంజనేయస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. శనివారం మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సత్యనారాయణస్వామి మండపంలో సమూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ వ్యవస్థాపకుడు, చైర్మన్ ఆంజనేయశర్మ తదితరులు పాల్గొన్నారు.

◆ న్యాయం చేయాలంటూ నిరసన

శివ్వంపేట(నర్సాపూర్): తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న తమ భూమిని ఇతరుల పేరిట మార్చారని, తమకు న్యాయం చేయాలంటూ రైతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం బాధితులు సత్తయ్య, సుశీల తదితరులు మాట్లాడుతూ మండల పరిధిలోని సికిద్లాంపూర్‌లో సర్వే నంబర్ 193లోని 3ఎకరాల భూమి ధరణి వచ్చాక రికార్డు నుంచి తొలగిపోయిందని, పలుమార్లు రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

◆ ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

నర్సాపూర్ రూరల్: మండలంలోని లింగాపూర్ అటవీ ప్రాంతంలోని గుట్టపై ఉన్న గండబేరుండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొన్నారు. 70వ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.